సాక్షి అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం । 2 । నవంబర్ । 2022



సూర్యోదయం కనువిందు
సాక్షి, పాడేరు: ప్రకృతి అందాలకు విశ్వవ్యాప్తి పొందిన వంజంగి హిల్స్‌లో మంగళవారం వేకువజామున అందాలు చూపరులను అబ్బురపరిచాయి. మంచుతెరలను చీల్చుకుంటూ సూర్యోదయం కనువిందు చేసింది.



మేలైన యాజమాన్యంతోనే అధిక దిగుబడులు
8లో
రాజ్‌మా సాగులో మేలైన యాజమాన్య పద్ధతులతోనే అధిక దిగుబడులు సాధ్యమని చింతపల్లి ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్తలు సూచించారు.

నాణ్యమైన సేవలు తప్పనిసరి
పెట్రోల్,గ్యాస్ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలని ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ ఆదేశించారు.
8లో



8 ప్రాజెక్టులు రూ. 10,842 కోట్లు







- ప్రధాని మోదీ, సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా ప్రారంభం, శంకుస్థాపనలు
- ఐఎన్‌ఎస్ చోళలో బసకు ఏర్పాట్లు చేస్తున్న తూర్పునౌకాదళం
- రెండు రోజుల్లో హెచ్‌పీసీఎల్ ప్రాజెక్ట్, ఐఐఎంవీకు కూడా గ్రీన్‌సిగ్నల్

ప్రారంభం

ఓఎన్‌జీసీలో అభివృద్ధి పనులు
రూ. 2,917 కోట్లు

పాతపట్నం–నరసన్నపేట కనెక్టివిటీ రహదారి
రూ. 211 కోట్లు

సాక్షి, విశాఖపట్నం: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మూడోసారి విశాఖ పర్యటన దాదాపు ఖరారైంది. ఈ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి పలు కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లలో ఆయా విభాగాల అధికారులు తలమునకలయ్యారు. దాదాపు 14 ప్రాజెక్టులు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటివరకు రూ.10,842.47 కోట్లతో చేపట్టిన, చేపట్టబోతున్న 8 ప్రాజెక్టులకు ప్రధాని కార్యాలయం నుంచి అంగీకారం లభించింది. రెండు మూడు రోజుల్లో మిగిలిన వాటికి కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చే అవకాశాలున్నాయి.

ఇదీ షెడ్యూల్

ఈ నెల 11న విశాఖకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రానున్నారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా అదే రోజు మధ్యాహ్నం విశాఖకు చేరుకుంటారు. ఆ రోజు సాయంత్రం ఐఎన్‌ఎస్ డేగాకు చేరుకోనున్న ప్రధాని మోదీని ముఖ్యమంత్రి స్వాగతం పలుకుతారు. అక్కడి నుంచి నేరుగా తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రానికి చేరుకుని ఐఎన్‌ఎస్ చోళలో రాత్రి బస చేస్తారు. 12వ తేదీ ఉదయం ఏయూ గ్రౌండ్స్‌కు చేరుకుని.. అక్కడి నుంచే భారీ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టనున్నారు. సుమారు 14 ప్రాజెక్టులను ప్రధాని చేతుల మీదుగా వర్చువల్ విధానంలో ప్రారంభం, శంకుస్థాపనలు జరగనున్నాయి. కొన్ని ప్రభుత్వ సంస్థలు ఆలస్యంగా జాబితా పంపించడంతో అవి ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో)లో పరిశీలనలో ఉన్నాయి. అవి కూడా త్వరలోనే షెడ్యూల్‌లోకి వచ్చే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకు 8 ప్రాజెక్టులకు అంగీకరించినట్లు పీఎంవో వర్గాలు వెల్లడించాయి. ఇందులో రైల్వే శాఖకు సంబంధించి రెండు, ఫిషరీస్‌కు చెందిన ఒకటి, రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ హైవేస్‌కు చెందినవి 3, పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ మినిస్ట్రీకి చెందిన 2 ప్రాజెక్టులున్నాయి.

ప్రాజెక్టుల వివరాలివీ....

- రూ.460 కోట్లతో విశాఖపట్నం రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులతో పాటు రూ.100.47 కోట్లతో సౌత్ కోస్టల్ రైల్వే జోన్ హెడ్‌క్వార్టర్స్ భవనానికి శంకుస్థాపన
- రూ.152 కోట్లతో విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ, అప్‌గ్రేడేషన్ పనులకు పునాది రాయి
- రూ.3,778 కోట్లతో ఏపీ సెక్షన్‌కు చెందిన రాయ్‌పూర్–విశాఖపట్నం ఎకనమిక్ కారిడార్ ఆరులైన్ల గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణం పనులకు శంకుస్థాపన
- రూ.566 కోట్లతో కాన్వెంట్ జంక్షన్ నుంచి షీలానగర్ వరకు పోర్టు వాహనాల రాకపోకలకు ప్రత్యేక రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన
- గెయిల్ సంస్థకు సంబంధించి రూ.2,658 కోట్లతో 321 కిలోమీటర్ల పొడవునా శ్రీకాకుళం నుంచి అంగూల్ పైప్‌లైన్ (ఎస్‌ఏపీఎల్) ప్రాజెక్టుకు శంకుస్థాపన
- రూ.211 కోట్లతో ఇచ్ఛాపురం నుంచి పర్లాఖిముండి వరకు రహదారి విస్తరణలో భాగమైన పాతపట్నం నుంచి నరసన్నపేట రెండులైన్ల రహదారిని ప్రారంభించి జాతికి అంకితం
- ఈస్టర్న్ ఆఫ్‌షోర్‌లో రూ.2,917 కోట్లతో ఓఎన్‌జీసీకి సంబంధించి యూ ఫీల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించి ప్రధాని మోదీ, సీఎం వైఎస్ జగన్ జాతికి అంకితం చేయనున్నారు.

వీటితో పాటుగా సుమారు రూ.26 వేల కోట్లతో హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్(హెచ్‌పీసీఎల్) చేపట్టిన రిఫైనరీ విస్తరణ ప్రాజెక్టు, గంభీరంలో రూ.445 కోట్లతో మొదటి విడతలో నిర్మించిన ఐఐఎంవీ భవనం, రూ.260 కోట్లతో వడ్లపూడిలో నిర్మించిన వ్యాగన్ వర్క్‌షాప్‌ను కూడా ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రారంభించే అవకాశాలున్నాయి. రూ.380 కోట్లతో ఈఎస్‌ఐ ఆస్పత్రి నిర్మాణానికి, భోగాపురం ఎయిర్‌పోర్టుకు కూడా శంకుస్థాపన చేసే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

శంకుస్థాపన

గెయిల్ పైప్‌లైన్ పనులు రూ. 2658 కోట్లు	సౌత్ కోస్టల్ రైల్వే జోన్ హెడ్‌క్వార్టర్స్ భవన నిర్మాణం రూ. 100.47 కోట్లు
రాయ్‌పూర్–వైజాగ్ ఎకనమిక్ కారిడార్ పనులు రూ. 3,778 కోట్లు	ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ పనులు రూ. 152 కోట్లు
విశాఖపట్నం రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు రూ. 460 కోట్లు	పోర్టు వాహనాల రాకపోకలకు ప్రత్యేక రహదారి నిర్మాణం రూ. 566 కోట్లు

ప్రధాని హోదాలో మూడోసారి..

ప్రధానమంత్రి హోదాలో నరేంద్రమోదీ మూడోసారి విశాఖకు రానున్నారు. 2016లో భారత నౌకాదళం ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ(ఐఎఫ్‌ఆర్)లో పాల్గొనేందుకు తొలిసారిగా మోదీ విశాఖలో పర్యటించారు. 2019 ఎన్నికల సందర్భంగా ఆ ఏడాది మార్చిలో రైల్వే గ్రౌండ్స్‌లో నిర్వహించిన సభకు ప్రధాని హాజరయ్యారు. మూడోసారి విశాఖకు వస్తున్న నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రతాపరమైన చర్యలు తీసుకుంటున్నారు. ఏయూ మైదానంలో బహిరంగ సభ ఏర్పాటు చేసి అక్కడి నుంచే ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు ఏర్పాట్లు చేస్తున్నారు. హెలిప్యాడ్ ఎక్కడ ఏర్పాటు చేయాలన్న అంశంపై అధికారులు ఆలోచన చేస్తున్నారు.

అత్యధికంగా ఆర్వోఎఫ్‌ఆర్ పట్టాల పంపిణీ

- తమ ప్రభుత్వానికే ఘనత
- అరకు ఎంపీ మాధవి, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



బాలారం గ్రామ సచివాలయంలో ఆర్వోఎఫ్‌ఆర్ పట్టాలు పంపిణీ చేస్తున్న ఎంపీ మాధవి, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

కొయ్యూరు: ఆదివాసీలకు అత్యధికంగా ఆర్వోఎఫ్‌ఆర్ పట్టాలు పంపిణీ చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని అరకు ఎంపీ మాధవి, పాడేరు ఎమ్మెల్యే కె భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని బాలారం గ్రామ సచివాలయంలో 53 మందికి ఆర్వోఎఫ్‌ఆర్ పట్టాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పట్టాలు ఇవ్వడంతో పాటు వారి ఖాతాల్లో రైతుభరోసా నగదు కూడా ప్రభుత్వం జమ చేస్తోందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆదివాసీలకు అటవిపై హక్కు కల సాకారమైందన్నారు. త్వరలో మిగిలిన వారికి కూడా త్వరలో పట్టాలు ఇస్తామన్నారు. నెల్లిపూడి, అంకంపాలెం, డి.మల్లవరం, బకులూరుకు చెందిన వారికి ఇక్కడ పట్టాలు ఇవ్వడం ఆనందంగా ఉందని చెప్పారు. ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ వారా నూకరాజు, కంఠారం సర్పంచ్ కన్నయమ్మ, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ నాగమణి, వైస్ ఎంపీపీలు వెంకటరమణ, నూకాలు, మండల పార్టీ అధ్యక్షుడు జల్లి బాబులు, కొయ్యూరు ఎంపీటీసీ మల్లికార్జున పాల్గొన్నారు.

దాసోహం

వలిసె పూల అందాలు ప్రకృతి ప్రేమికులను ఆకర్షిస్తున్నాయి. స్థానికులు, పర్యాటకులు వీటి అందాలకు దాసోహం అవుతున్నారు. పసుపు పచ్చని తివాచీ పరిచినట్లుగా కనిపిస్తూ మంత్రముగ్ధులను చేస్తున్నాయి. పర్యాటకులకు ప్రకృతి అందాలతోపాటు దారి పొడవునా వలిసె పూలు స్వాగతం పలుకుతున్నాయి.
– ముంచంగిపుట్టు



పోచవరం బోట్ పాయింట్ పరిశీలన

- కలెక్టర్ ఆదేశాలనంతరం పాపికొండల పర్యాటకానికి అనుమతి
- చింతూరు సబ్‌కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



పోచవరం బోట్ పాయింట్ వద్ద వివరాలు తెలుసుకుంటున్న సబ్‌కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

వీఆర్‌పురం: పాపికొండలు విహారయాత్రకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల అనంతరం అనుమతి ఇస్తామని చింతూరు సబ్‌కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. మండలంలోని పోచవరం బోట్ పాయింట్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. బోట్లు, వాటి అనుమతుల వివరాలను అక్కడి సిబ్బంది నుంచి తెలుసుకున్నారు. సమీపంలోని బోట్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించారు. తదనంతరం రేఖపల్లి రెవెన్యూ కార్యాలయంలో బోట్ యూనియన్ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీ టూరిజం శాఖ క్లియరెన్సు, కలెక్టర్ ఆదేశాల మేరకు బోటింగ్‌కు అనుమతి ఇస్తామని స్పష్టం చేశారు. తహసీల్దార్ ఎస్.శ్రీధర్, ఎంపీడీవో ఫణీంద్ర, బోట్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పాడేరులో భారీ వర్షం



సాక్షి,పాడేరు: ఏజెన్సీలో మంగళవారం సాయంత్రం నుంచి వాతావరణం ఒక్కసారిగా మారిపోయి భారీ వర్షం కురిసింది. హుకుంపేట, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లో కూడా ఇదే పరిస్థితి. పాడేరు పట్టణంతో పాటు, సమీప గ్రామాల్లో రాత్రి ఏడున్నర గంటల నుంచి భారీ వర్షం కురవడంతో జనజీవనానికి అంతరాయం ఏర్పడింది. వరి పంట కోత దశలో ఉన్న సమయంలో కురిసిన వర్షం రైతులను ఆందోళనకు గురి చేసింది.

అర్హులందరికీ నేరుగా పథకాలు

- గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం
- కలెక్టర్ సుమిత్‌కుమార్
- ఎమ్మెల్యే పాల్గుణ అధ్యక్షతన గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహణ



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే పాల్గుణ

పెదబయలు: అర్హత గల ప్రతీ కుటుంబానికి పథకాలను ప్రభుత్వం నేరుగా అందిస్తోందని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. మంగళవారం అడుగులుపుట్టు గ్రామ సచివాలయం పరిధిలో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అధ్యక్షతన తొరంగుల, సంపంగిపుట్టు, తమరడ, అడుగులపుట్టు, గొంది కోడాపుట్టు గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. దీనిలో భాగంగా గొంది కోడాపుట్టు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రజలతో మమేకమయ్యారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. పక్కా గృహాల నిర్మాణం వేగవంతం చేయాలని కోరారు. అటవీ హక్కు పట్టాల పంపిణీ వివరాలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే పాల్గుణ ఇంటింటికీ వెళ్లి పథకాల అమలుతీరును తెలుసుకున్నారు. గ్రామ సచివాలయం, గ్రామ వలంటీర్ల వ్యవస్థ ద్వారా చెంతకే సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ప్రభుత్వం రైతులకు ప్రోత్సహిస్తోందని, పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. అడుగులపుట్టులో వైఎస్సార్ జెండాను ఆవిష్కరించారు. రాష్ట్ర అగ్రో డైరెక్టర్ సన్యాసి, మాజీ జెడ్పీటీసీ సూర్యనారాయణ, మండల స్థాయి అధికారులు, మాజీ ఎంపీటీసీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

పెదబయలు: మండలంలోని జరుగుతున్న పలు అభివృద్ధి పనులను కలెక్టర్ సుమిత్ కుమార్ మంగళవారం పరిశీలించారు.రూడకోట పంచాయతీలోని రుడలంపుట్టు, బడంబీరు, కొత్తరూడకోట, రూడకోట గ్రామాల్లో ద్విచక్రవాహనంపై సర్పంచ్ సురేష్‌తో కలిసి పర్యటించారు. గిరిజనులతో మాట్లాడారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. రూడకోటలో రూ.1.5 కోట్లతో పీహెచ్‌సీ వద్ద నిర్మిస్తున్న బర్త్ అండ్ వెయిటింగ్ హాల్, ఉద్యోగులు క్వార్టర్ల పనులను పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పీహెచ్‌సీని తనిఖీ చేశారు. గిరిజనులకు అందుతున్న వైద్య సేవలపై సిబ్బంది నుంచి తెలుసుకున్నారు. సచివాలయం సందర్శించి సేవలపై ఆరా తీశారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. స్పందన కార్యక్రమం క్రమం తప్పకుండా నిర్వహించాలని ఆదేశించారు. ఎంపీటీసీ సంగీత, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఎముకలు కొరికే చలిలోనూ..

- ప్రభుత్వ లక్ష్యంతో మమేకం
- వేకువజామున పింఛన్లు పంపిణీ చేసిన వలంటీర్లు
- గడప గడపకు వెళ్లి అందజేత
- తొలిరోజు జిల్లా వ్యాప్తంగా 52.29 శాతం పూర్తి

సాక్షి,పాడేరు: ఒకపక్క పొగమంచు.. మరోపక్క ఎముకలు కొరికే చలిని లెక్కచేయకుండా గ్రామ వలంటీర్లు ప్రభుత్వ లక్ష్యంతో మమేకమయ్యారు. మంగళవారం వేకువజాము నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. ప్రభుత్వ ఆశయానికి తగ్గట్టుగా గడప గడపకు వెళ్లి లబ్ధిదారులకు అందజేశారు. నవంబర్ నెలకు సంబంధించి జిల్లాలోని 22 మండలాల్లో 1,20,723 మంది వైఎస్సార్ పింఛన్ కానుక లబ్ధిదారులకు గాను ప్రభుత్వం రూ.30 కోట్ల 81 లక్షల 37వేలను విడుదల చేసింది. తొలిరోజు జిల్లా వ్యాప్తంగా 63,131మందికి రూ.16కోట్ల 44 లక్షల 8 వేలను పంపిణీ చేశారు. జిల్లా మొత్తం మీద కూనవరం మండలంలో 3056 మందికి పింఛన్ పంపిణీ చేయడంతో 80.4 శాతం సాధించింది. ఎటపాకలో 73.33, వీఆర్‌పురంలో 72.92, చింతూరులో 67.98, మారేడుమిల్లిలో 61.32, రంపచోడవరంలో 61.25, రాజవొమ్మంగిలో 60.51, హుకుంపేటలో 60.33, పెదబయలులో 55.62, పాడేరులో 54.68, గంగవరంలో 54.27, డుంబ్రిగుడలో 53.62, అనంతగిరిలో 49.98, దేవీపట్నంలో 49.78, అడ్డతీగలలో 48.21, అరకులోయలో 46.97, చింతపల్లిలో 45.26, ముంచంగిపుట్టులో 43.38, జి.మాడుగులలో 43.36, గూడెంకొత్తవీధిలో 37.57, వై.రామవరంలో 30.44, కొయ్యూరులో 30.19శాతం మేర తొలిరోజు వైఎస్సార్ పింఛన్ కానుక సొమ్మును పంపిణీ చేశారు.



జాముగుడలో వృద్ధుడికి పింఛను పంపిణీ చేస్తున్న గ్రామవలంటీర్

ధారాలమ్మ ఆలయ దోపిడీ దర్యాప్తు వేగవంతం

సీలేరు: ధారాలమ్మ ఆలయంలో దోపిడీపై పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. అమ్మవారి ఆలయ పరిసర ప్రాంతాల్లోని గ్రామాల్లో మంగళవారం జీకేవీధి సీఐ అశోక్‌కుమార్ విచారణ చేపట్టారు. దోపిడీ ఘటనపై నిందితుల వివరాలు తెలిస్తే తక్షణం సమాచారం ఇవ్వాలని గిరిజనులను కోరారు. అనుమానం ఉన్న వ్యక్తులతో మాట్లాడి సమాచారం సేకరించాలన్నారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, చింతపల్లి ఏఎస్పీ, సిబ్బందిని సాంకేతిక పరమైన అన్ని కోణాలలో కూడా విచారణ చేపట్టాలని ఆదేశించారు.

నాగాభరణం బహూకరణ


శివలింగానికి అలంకరించిన నాగాభరణం

సాక్షి, పాడేరు: పాత పాడేరులోని పురాతన శివాలయంలోని శివలింగానికి సోమవారం రాత్రి నాగాభరణాన్ని అలంకరించి కార్తీకమాసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాడేరులోని వర్తక సంఘం నేత పకోడి సత్యనారాయణ, శేషారత్నం దంపతులు ఇత్తడితో తయారు చేయించిన నాగాభరణాన్ని ఆలయ ప్రధాన అర్చకులు ఫణిశర్మకు అందజేశారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

జిల్లా శిశు సంక్షేమశాఖ పీడీ సూర్యలక్ష్మి

ముంచంగిపుట్టు: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటామని జిల్లా శిశు సంక్షేమశాఖ జిల్లా పీడీ ఎస్ సూర్యలక్ష్మి అన్నారు. మండలంలోని పెదగూడ పంచాయతీ కేంద్రంతో పాటు సారధి, జర్జుల పంచాయతీ కులబీరు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. కేంద్రాల ద్వారా అందుతున్న పౌష్టికాహారంపై గ్రామస్తులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఆయా ప్రాంతాల్లో నాడు–నేడు ద్వారా మంజూరైన అంగన్‌వాడీ భవనాల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ సూర్యలక్ష్మి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని, పీడీఎస్ విధానాన్ని పక్కాగా అమలుచేయాలని ఆదేశించారు. గ్రామాల్లో రక్తహీనత ఉన్న గర్భిణులను గుర్తించి, ఆరోగ్యం, తీసుకోవాల్సిన పోషకాహారంపై అవగాహన కల్పించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారుల హాజరును ప్రత్యేక యాప్‌లో పొందపర్చాలని, పీడీఎస్ పొందేటట్లు ప్రతి ఒక్క అంగన్‌వాడీ వర్కర్ తమ విధులు నిర్వర్తించాలని సిబ్బందికి సూచించారు. ఐసీడీఎస్ సీడీపీవో ఎస్.రాజేశ్వరి, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులున్నారు.


కులబీరు అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు తనిఖీ చేస్తున్న పీడీ సూర్యలక్ష్మి

సారాబట్టీలపై దాడులు

ఎటపాక: మండలంలోని నాటుసారా తయారీ కేంద్రాలపై పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఓఎస్డీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు గుండివారిగూడెం గ్రామంలో సీఐ గజేంద్రకుమార్ ఆధ్వర్యంలో సారా తయారుచేస్తున్న వారిని పోలీసులు పట్టుకున్నారు. ఈ దాడుల్లో సుమారు 40 లీటర్ల సారా, 8వేల లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సారా తయారీకి ఉపయోగించే పాత్రలు, డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నారు. సారా తయారు చేసినా, విక్రయించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. దాడుల్లో ఎస్ఐ పార్థసారథి, సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసర సరకులు


వరద బాధితులకు నిత్యావసర సరకులు అందజేస్తున్న సబ్ కలెక్టర్ ఫర్మాన్‌అహ్మద్‌ఖాన్

వీఆర్‌పురం: ఇటీవల సంభవించిన వరదల్లో సర్వం కోల్పోయిన పోచవరం గ్రామస్తులకు గివ్ ఇండియా, యాక్షన్ ఎయిడ్ సంస్థలు సమకూర్చిన నిత్యావసర సరకులను చింతూరు సబ్‌కలెక్టర్ ఫర్మాన్‌అహ్మద్‌ఖాన్ చేతుల మీదుగా మంగళవారం పంపిణీ చేశారు. సుమారు 14 రకాల సరుకులతో కూడిన ఈ కిట్లను 111 కుటుంబాలకు అందజేసినట్టు ఏఎస్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ వి.గాంధీబాబు తెలిపారు. తహసీల్దార్ ఎస్.శ్రీధర్, ఎంపీడీవో ఫణీంద్ర, జెడ్పీటీసీ వాళ్ల రంగారెడ్డి, ఎంపీటీసీ వాళ్ల వెంకటేశ్వ రెడ్డి, సర్పంచ్ సీతారామ్‌రెడ్డి, ఏఎస్‌డీఎస్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన సేవలు తప్పనిసరి

ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

హుకుంపేట: పెట్రోల్,గ్యాస్ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలని ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ ఆదేశించారు. మండల కేంద్రంలో గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్‌ను, గ్యాస్ గోదాములను ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, విక్రయాల నమోదు వివరాలను పరిశీలించారు. పెట్రోల్ బంక్‌లోని అదనపు గడితో జీసీసీ ఉత్పత్తులను విక్రయించాలని సూచించారు. మరుగుదొడ్ల మరమ్మతులు చేపట్టాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. భద్రత చర్యలపై ఆరా తీశారు. పెట్రోల్ బంకులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పెట్రోల్, డీజిల్ నిల్వలను తనిఖీ చేశారు. ధరల పట్టిక ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పెట్రోల్ బంక్‌లో వెంటనే గాలి పంపును ఏర్పాటు చేయాలని సూచించారు. జీసీసీ డీఎం పార్వతమ్మ, ఎంపీడీవో వెంకటరావు, తహసీల్దార్ రాజ్యలక్ష్మి, జీసీసీ సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌ఎం, డిప్యూటీ వార్డెన్ల వితరణ


పాఠశాలలో ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న హెచ్‌ఎం, సర్పంచ్ తదితరులు

కొయ్యూరు: మండలంలోని మంప గ్రామంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు హెచ్‌ఎం జర్త సత్తిబాబు, డిప్యూటీ వార్డెన్ తూబే శ్రీనివాసరావు తమ సొంత నిధులతో ఆర్‌ఓ వాటర్ ప్యూరిఫైర్ యంత్రాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ త్రినాథ్‌పడాల్ ఆర్‌ఓ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ హెచ్‌ఎం, డిప్యూటీ వార్డెన్‌లను ఆయన అభినందించారు. పాఠశాలలో అభివృద్ధి పనులకు దాతలు ముందుకు రావాలని కోరారు. హెచ్‌ఎం సత్తిబాబు మాట్లాడుతూ విద్యార్థులకు సురక్షిత నీరందించేందుకు ప్లాంట్‌ను అందుబాటులో తీసుకొచ్చామన్నారు. సచివాలయ కార్యదర్శి పవన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మేలైన యాజమాన్యంతోనే అధిక దిగుబడులు

చింతపల్లి: రాజ్‌మా సాగులో గిరిజనులు అధిక దిగుబడులు సాధించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు సూచించారు. జి.మాడుగుల మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం పర్యటించిన శాస్త్రవేత్తలు పూత, పిందె దశలో ఉన్న పంటలను పరిశీలించారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా గత కొన్నేళ్లుగా పంటలు దెబ్బతిని విత్తన కొరత ఏర్పడిందన్నారు. ప్రభుత్వం రాయితీపై రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేయడంతో సాగు విస్తీర్ణం పెరిగిందని, ఈ నేపథ్యంలో రైతులు విత్తనోత్పత్తికి చర్యలు తీసుకోవాలన్నారు. నుర్మతి, కిల్లంకోట, గోమంగి, గుల్లెలు తదితర గ్రామాల్లో పంటలను పరిశీలించారు. శాస్త్రవేత్తలు సీతారాములు, రవీంద్ర ప్రసాద్,ఏవో పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాస్‌కు సేవాపతకం



సాక్షి,పాడేరు: జిల్లా అగ్నిమాపక అధికారి పి.శ్రీనివాస్ ఉత్తమ సేవలకు గాను రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ సేవా పతకానికి ఎంపిక చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర విపత్తులు నివారణ, అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్, రాష్ట్ర స్థాయిలో సేవా పతకాన్ని శ్రీనివాస్‌ను సిఫార్సు చేస్తూ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది.

ఘనంగా విజిలెన్స్ వారోత్సవాలు


ప్రతిజ్ఞ చేస్తున్న పోస్టల్ అధికారులు

రాజవొమ్మంగి: స్థానిక తపాలా కార్యాలయంలో తపాలా విజిలెన్స్ వారోత్సవాలను ఏఎస్పీ (కాకినాడ) శ్రీనివాస్ మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఖాతాదారులకు మెరుగైన సేవలందించాలని సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఐపీఓ వీరభద్రరావు, ఎస్పీఎం ప్రసాద్, పోస్టుమాస్టార్లు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం
- అమరజీవికి ఘనంగా నివాళి


చింతూరులో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్


పాడేరు ఐటీడీఏలో నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ


పాడేరు: వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న డాక్టర్ నరసింగరావు..


రంపచోడవరం ఐటీడీఏలో నివాళులర్పిస్తున్న ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

సాక్షి,పాడేరు: పరిపాలన వికేంద్రీకరణ ద్వారా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్త జిల్లా ఏర్పాటుచేసి గిరిజనులకు పాలన చేరువ చేసిందని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని మంగళవారం జిల్లా కేంద్రమైన పాడేరులో ఘనంగా నిర్వహించారు.కలెక్టరేట్‌లో ఆయన జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం స్వీకరించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఆయనతోపాటు జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ, సబ్ కలెక్టర్ వి.అభిషేక్, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా గిరిజన గ్రామాల అభివృద్ధి జరుగుతుందని, అన్ని సంక్షేమ పథకాలు అర్హులకు అందుతున్నాయన్నారు. రానున్న రోజుల్లో జిల్లా సమగ్రాభివృద్ధి సాధిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

అమరజీవి ఆశయాలు ఆదర్శనీయం: పీవో గోపాలకృష్ణ

ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం పోరాటం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాముల ఆశయాలు ఆదర్శనీయమని ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ అన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సమావేశమందిరంలో అమరజీవి పొట్టి శ్రీరాముల చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన ఘనంగా నివాళులర్పించారు. ఐటీడీఏ ఆవరణలో జాతీయ జెండాను ఆవిష్కరించి, గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరవీరుని త్యాగాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో వెంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమ డీడీ కొండలరావు, ఈఈ డి.వి.ఆర్.ఎం.రాజు, ఏవో హేమలత తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో..

ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి క్యాంపు కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నరసింగరావు తదితరులు అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వైస్ ఎంపీపీ కె.కనకాలమ్మ, ఎంపీటీసీలు లకే రామకృష్ణపాత్రుడు, కె.నరసింహరావు, చిట్టమ్మ, సర్పంచ్‌లు వంతాల సీతమ్మ, లకే పార్వతమ్మ, సీదరి రాంబాబు, వంతాల రాంబాబు పాల్గొన్నారు.

చింతూరు: రాష్ట్ర సాధన కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం చిరస్మరణీయమని చింతూరు సబ్ కలెక్టర్, ఐటీడీఏ పీవో ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం మంగళవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహనీయుల త్యాగాల ఫలితంగా వచ్చిన రాష్ట్ర అభివృద్ధికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

రంపచోడవరం: స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో పీవో సూరజ్ గనోరే పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు. ఏపీవో సీహెచ్ శ్రీనివాస్‌రావు, ఏవో డీఎస్‌వీ రమణ, ఎస్‌వో కబోది, డీఎస్‌వో బీఎస్ కుమార్, డీటీ కె.విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ శుభం బన్సల్ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేశారు.

అర్హులందరికీ ఇళ్లు

గృహనిర్మాణశాఖ పీడీ శ్రీనివాసరావు


మాట్లాడుతున్న గృహనిర్మాణశాఖ పీడీ శ్రీనివాసరావు

గూడెంకొత్తవీధి: పేదల సొంతింటి కల సాకారం దిశగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని గృహనిర్మాణశాఖ పీడీ శ్రీనివాసరావు అన్నారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా రింతాడ–1 సచివాలయంలో గ్రామసభ నిర్వహించారు. ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో గృహ నిర్మాణాల లబ్ధిదారులతో చర్చించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రింతాడ–1లో 152 గృహాలు, రింతాడ–2లో 64 ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. వీటన్నింటిని త్వరతగ గతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గృహనిర్మాణశాఖ ఈఈ బాబూరావు, ఏఈ వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు లక్షణ్, సర్పంచ్ లక్ష్మి, ఈవోపీఆర్డీ పాపారావు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం కేసును ఛేదించిన పోలీసులు

చింతపల్లి రూరల్: మండలంలోని అన్నవరంకు చెందిన వివాహిత అదృశ్యం కేసును ఒక్క రోజులో ఛేదించామని ఎస్ఐ సాయికుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన కంటా ధార (18) గత నెల 30న భర్త సోమేష్‌తో వివాదం కారణంగా పరారయ్యింది. దీంతో అన్నవరం పోలీస్ స్టేషన్‌లో భర్త ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో విశాఖపట్నంలో ఆమెను పట్టుకుని ఇంటికి చేర్చామని ఎస్ఐ తెలిపారు.

యువతిని మోసగించిన యువకుడిపై కేసు

మాకవరపాలెం: యువతిని నమ్మించి మోసగించిన యువకుడిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు. మండలంలోని తామరం గ్రామానికి చెందిన కోసూరు వరలక్ష్మి(24), నర్సీపట్నం మండలం గురొందరపాలెం గ్రామానికి చెందిన ఇసరపు గణేష్ (24) కొంతకాలంగా ప్రేమించుకున్నారు. అయితే పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా దగ్గరై ఇప్పుడు ముఖం చాటేశాడు. దీంతో బాధిత యువతి మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. దీనిపై నర్సీపట్నం రూరల్ సీఐ శ్రీనివాసరావు విచారణ చేస్తున్నారని ఎస్ఐ తెలిపారు.

తూనికలు, కొలతలశాఖ అధికారుల దాడులు


తామరంలో పాత ఇనుము దుకాణంలో తనిఖీలు చేస్తున్న రంగారెడ్డి

మాకవరపాలెం: దుకాణాలపై తూనికలు, కొలతలశాఖ అధికారులు దాడులు చేశారు. మండల కేంద్రానికి చెందిన పి.ఫ్రాన్సిస్ వివిధ దుకాణాల్లో వినియోగిస్తున్న కాటాల్లో తేడాలున్నాయంటూ ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం తూనికలు, కొలతల శాఖ ఇన్‌చార్జి అసిస్టెంట్ కంట్రోలర్ పి.వి.రంగారెడ్డి మాకవరపాలెం, తామరంలోని చికెన్, పాత ఇనుము దుకాణాల్లో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా రెండు పాత ఇనుము దుకాణాల్లో 15 కేజీలకు మూడు కేజీలకు పైగా తేడాలున్నట్టు గుర్తించి కాటాలను సీజ్ చేశారు. ఈ దుకాణాల యజమానులపై కేసులు పెడతామని రంగారెడ్డి స్పష్టం చేశారు. తూకం, కొలతల్లో తేడాలుంటే కేసులు తప్పవని ఆయన దుకాణదారులను హెచ్చరించారు. ఆయన వెంట నర్సీపట్నం కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీలో చేరిక

పార్టీ కండువాలు వేసి ఆహ్వానించిన ఎంపీ మాధవి, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి


పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎంపీ మాధవి, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

కొయ్యూరు: మండలంలో టీడీపీకి చెందిన ముగ్గురు సీనియర్ నేతలు కంఠారంలో మంగళవారం అరకు ఎంపీ మాధవి, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. కంఠారంలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వీరికి ఎంపీ, ఎమ్మెల్యేలు కండువాలు వేసి ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై, టీడీపీ తీరుపై విసుగు చెందిన వైఎస్సార్‌సీపీలో చేరినట్టు టీడీపీ నేతలు పాతర తాతారావు, పెదిరెడ్ల రమణ, పెదిరెడ్ల శివాజీ చేరారు. వీరి ద్వారా మరో 20 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరనున్నాయి. తాతారావు గతంలో సర్పంచ్‌గా పోటీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ రాష్ట్రంలో 50 శాతానికి పైగా ఓట్లు కలిగి ఉందన్నారు. ఎన్ని పార్టీలు కలిసినా వైఎస్సార్ సీపీ ఒంటరిగానే బరిలోకి దిగి విజయం సాధిస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ప్రజలు మళ్లీ బ్రహ్మరథం పడతారన్నారు. ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ వారా నూకరాజు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, సీనియర్ నేత గాడి సత్యనారాయణ, వైస్ ఎంపీపీలు అప్పన వెంకటరమణ, అంబటి నూకాలు, సర్పంచ్ జంపా కన్నయమ్మ, పార్టీ మండల అధ్యక్షులు జల్లి బాబులు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు రేగటి ముసిలినాయుడు, మహిళా విభాగం ప్రతినిధి రాజులమ్మ, సర్పంచ్‌లు రాజకుమారి, సోమన్నదొర, ఎంపీటీసీ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

న్యాయ సమీక్షకు 'విద్యుత్ పంపిణీ' పనులు

ఈపీడీసీఎల్ సీఎండీ సంతోషరావు



సాక్షి, విశాఖపట్నం: ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఏలూరు సర్కిళ్లలో విద్యుత్ పంపిణీ వ్యవస్థ బలోపేత పనుల అంశాలపై న్యాయ సమీక్షకు వెళ్తున్నట్లు సీఎండీ కె.సంతోషరావు ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ విద్యుత్తు ఫీడర్లను వేరు చేయడం ద్వారా విద్యుత్ సరఫరా నష్టాల తగ్గింపు, విద్యుత్ పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయడానికి సంబంధించిన పనులు, విపత్తు సంభవించే ప్రాంతాల్లో అండర్ గ్రౌండ్ కేబులింగ్ పనులకు టెండర్లను పిలిచేందుకు ముందుగా సంబంధిత డాక్యుమెంట్లను న్యాయ సమీక్షకు పంపినట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యుత్ పంపిణీ పునర్‌వ్యవస్థీకరణ పథకంలో భాగంగా సంస్థ పరిధిలో అధిక లోడ్ ఉన్న 11 కేవీ ఫీడర్లను విభజించడం, గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్తు వ్యవస్థను మెరుగుపరచడం, వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా చేసేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల్ని అభివృద్ధి చేయడం, గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలకు నిరంతర త్రీఫేజ్ విద్యుత్తు సరఫరాకు ప్రత్యేక ఫీడర్ల ఏర్పాటు తదితర పనులకు టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆయా టెండర్లకు సంబంధించిన పనుల్లో పారదర్శకత కోసం వినియోగదారుల నుంచి సలహాలు, సూచనలు, అభ్యంతరాలను స్వీకరించేందుకు వీలుగా ఈ ప్రక్రియ చేపడుతున్నామన్నారు. ఈ డాక్యుమెంట్లను జ్యుడిషియల్ కమిషన్ అధికారిక వెబ్‌సైట్ www.judiciapreview.ap.gov.inలో పొందుపరిచామన్నారు. ఈ అంశంపై ప్రజలు, వినియోగదారులు తమ సలహాలు, సూచనలు, అభ్యంతరాలను ఏడు రోజుల్లోగా జ్యుడిషియల్ కమిషన్ ఈ–మెయిల్ ఐడి judfejpp@ap.gov.in లేదా apjudiciapreview@gmail.com కు పంపించవచ్చని సూచించారు.

పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేయాలి


పార్టీ నేతలతో మాట్లాడుతున్న ఎస్టీ సెల్ అధ్యక్షురాలు వెంకటలక్ష్మి

సీలేరు: సీలేరు, దారకొండ, గుమ్మిరేవులు, దుప్పులవాడ పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ అధ్యక్షురాలు డాక్టర్ ఎం.వెంకటలక్ష్మి మంగళవారం పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో పార్టీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీశ్రేణులంతా సమష్టిగా పనిచేయాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

పులపర్తిలో చైన్ స్నాచింగ్

వివాహిత మెడలో పుస్తెలతాడు చోరీ

యలమంచిలి: మండలంలోని పులపర్తి పెద్ద చెరువు గట్టు వద్ద పొలం పనిలో వున్న ఒక మహిళకు మస్కా కొట్టి ఇద్దరు గుర్తు తెలియని యువకులు ఆమె మెడలో వున్న రెండు తులాల బంగారుతాడు అపహరించుకుపోయారు. ఈ ఘటనపై బాధితురాలు మంగళవారం రాత్రి యలమంచిలి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలివి. పులపర్తి నుంచి గూండ్రుబిల్లి వెళ్లే దారిలో పులపర్తి పెద్ద చెరువు గట్టు వద్ద ఈ గ్రామానికి చెందిన బెజవాడ కొండమ్మ తన వరి పొలంలో ఇద్దరు కూలీలతో మంగళవారం సాయంత్రం యూరియా వేయిస్తోంది. ఈ సమయంలో ఇద్దరు గుర్తు తెలియని యువకులు బైక్‌పై అక్కడకు వచ్చారు. ఈ లోపు కొండమ్మ ఫోన్ మాట్లాడుతుండాన్ని గమనించిన ఆ యువకులిద్దరూ బైక్ ఆపి, అత్యవసరంగా తమ స్నేహితులకు ఒకసారి ఫోన్ చేయాలని, నంబరు చెబుతామని ఫోన్ చేసి ఇవ్వమని కోరారు. ఈలోగా కొండమ్మ ఫోన్ చేస్తుండగా, ఒక యువకుడు ఆమె మెడలో వున్న రెండు తులాల బంగారు తాడు తెంచాడు. కనురెప్పపాటులో ఆ ఇద్దరు యువకులు అక్కడి నుంచి పరారయ్యారు. దీంతో ఆమె లబోదిబోమంటూ కేకలు వేయగా, అప్పటికే వారు బైక్‌పై ఉడాయించారు. ఈ మేరకు మంగళవారం రాత్రి బాధితురాలు యలమంచిలి రూరల్ పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారు.

క్లుప్తంగా

లబ్ధిదారులకు చెక్కులు



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎంపీపీ ఆనందరావు

వై.రామవరం: మండలంలో పశువులశాలలు నిర్మించుకున్న 27మంది లబ్ధిదారులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కడబాల ఆనందరావు మంగళవారం చెక్కులు అందజేశారు. పశువుల శాలల నిర్మాణానికి ప్రభుత్వం ఐటీడీఏ ద్వారా ఒక్కొక్క లబ్ధిదారుడికి రూ. 1.11లక్షలు వంతున మంజూరు చేసినట్టు ఎంపీపీ ఆనందరావు చెప్పారు. లబ్ధిదారులు షెడ్ల నిర్మాణం చేపట్టిన వారికి మొదటి విడతగా రూ.17 వేలు చెక్కును అందజేశారు. మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు విజయకుమార్, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందనలు



క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ భరత్‌కుమార్‌నాయక్

అరకులోయ రూరల్: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా విశాఖపట్నంలోని మధురవాడలో స్పోర్ట్స్ ఆఫ్ సనాతన ధర్మ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జైహింద్ క్రికెట్ లీగ్ పోటీలో అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థులు మూడో స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా కాలేజీలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయా క్రీడాకారులను ప్రిన్సిపాల్ భరత్‌కుమార్‌నాయక్ తదితరులు అభినందించారు. విద్యార్థులు చదవు తో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ పద్మలత, పీడీ అప్పారావు, సిబ్బంది తదితరులున్నారు.

పూర్వ విద్యార్థుల వితరణ



గ్రాస్ కట్టర్‌ను అందజేస్తున్న డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థులు

పాడేరు రూరల్ : పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులు మంగళవారం గ్రాస్ కట్టర్, సర్క్యులర్ బోర్డులను అందజేశారు. పాడేరు మండలం గొండెలి పంచాయతీ లింగాపుట్టు గ్రామానికి చెందిన కూడా మత్స్యరాజు (2004-2007), గొండెలి గ్రామానికి చెందిన కిముడు ప్రసాద్‌నాయుడు(2007-2010) కాలేజీలో అభ్యసించారు. వారిద్దరు కలిసి కాలేజీకి గ్రాస్ కట్టర్, ఏడు సర్క్యులర్ బోర్డులను ప్రిన్సిపాల్ వనుము చిట్టిబాయ్‌కి బహుకరించారు. ఆయా విద్యార్థులను ప్రిన్సిపాల్, సిబ్బంది అభినందించారు.

పీహెచ్‌సీ వైద్యాధికారిగా భావన



గంగవరం : గంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా డాక్టర్ ఓ. భావన బాధ్యతలు స్వీకరించారు. గంగవరం మండల గొరగమ్మి గ్రామానికి చెందిన డాక్టర్ భావన మాట్లాడుతూ సొంత మండలంలో ప్రజలకు వైద్య సేవలందించే అదృష్టం తనకు లభించడం ఆనందంగా ఉందన్నారు.

గృహ నిర్మాణ పనులకు శంకుస్థాపన



పనులకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు బేబీరత్నం

గంగవరం: మండలంలోని గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద 252 గృహాలు మంజూరైనట్టు ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు బేబీరత్నం చెప్పారు. ఇందులో భాగంగా బర్రిమామిడిలో గృహ నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. సర్పంచ్ రాజులమ్మ, తహసీల్దార్ శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

- కొయ్యూరు, రాజవొమ్మంగిలో గడప గడపకు మన ప్రభుత్వం
- ఎంపీ మాధవి, ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, ధనలక్ష్మిలకు ఘన స్వాగతం



కంతారంలో గ్రామస్తులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి



కొండపల్లిలో గ్రామస్తులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

కొయ్యూరు: గిరిజనుల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని కంతారం పంచాయతీలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు గ్రామంలో పర్యటించి, స్థానికుల సమస్యలను, సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు సక్రమంగా, సకాలంలో అందుతున్నాయని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల చెంతకే ప్రభుత్వ పాలన అందుబాటులో వచ్చిందన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ప్రభుత్వ సదుపాయాలన్ని అందుతున్నాయన్నారు. వేలాది మంది గిరిజనులకు ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలను ప్రభుత్వం అందజేసిందన్నారు. గ్రామ సచివాలయాల్లో గుర్తించిన పనులను త్వరలో చేపడతామని, సర్పంచ్‌ల ద్వారా ప్రధానంగా గుర్తించిన పనులను ముందుగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ సభ్యుడు నూకరాజు, వైస్ ఎంపీపీలు వెంకటరమణ, నూకాలు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ నాగమణి, సర్పంచ్ కన్నయమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు బాబులు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ గజ్జయ్యదొర, నాయకులు సత్యనారాయణ, వనంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం: రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

రాజవొమ్మంగి: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తున్నట్టు రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి చెప్పారు. మండలంలోని కొండపల్లి, శరభవరం పంచాయతీలకు చెందిన కొండపల్లి, మర్రిపాలెం, తెల్లకొండ, బాసలవీధి, దాకరాయి, వణకరాయి, అప్పన్నపాలెం గ్రామాల్లో మంగళవారం గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలు ఎమ్మెల్యే ధనలక్ష్మికి హారతులిస్తూ, పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో సుమారు 300 గడపలను ఎమ్మెల్యే సందర్శించి, ఇంటింటికీ వెళ్లి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుతీరు, స్థానిక సమస్యలపై ఆరా తీశారు. రైతు భరోసా, అమ్మఒడి, వైఎస్సార్ చేయూత తదితర పథకాలన్నీ సక్రమంగా అందుతున్నాయని లబ్ధిదారులు ఎమ్మెల్యే వద్ద ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకతీతంగా పథకాలను అమలుచేస్తున్నారన్నారు. కొండపల్లి, మర్రిపాలెం గ్రామాల్లో రోడ్డు, డ్రైనేజీ సమస్యలను స్థానికులు విన్నవించగా, స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆయా సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రాజవొమ్మంగిలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నాడు-నేడు ద్వారా రూ.48లక్షలతో చేపట్టనున్న పనులకు ఎమ్మెల్యే ధనలక్ష్మి భూమి పూజ చేశారు. జడ్డంగి, దూసరపాము, చెరకుంపాలెం గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు జ్యోతి, మండల పార్టీ కన్వీనర్ రామకృష్ణ, పార్టీ జిల్లా కార్యదర్శి వెంకటేష్‌రాజు, సర్పంచ్‌లు జగన్నాథం, చంద్రుడు, శుభలక్ష్మి, సత్యనారాయణ, శివ, గణలక్ష్మి, బి.సత్యనారాయణ, వైస్ ఎంపీపీలు చంద్రరాణి, గంగదుర్గ, ఎంపీటీసీ సభ్యులు లోవలక్ష్మి, కామేష్, నాయకులు కుశరాజు, వెంకటరమణ, హౌసింగ్ డీఈ నరసింహరావు, తహసీల్దార్ సుబ్రహ్మణ్యాచారి, డీటీ సత్యనారాయణ, ఎంపీడీవో బాపన్నదొర, ఎంఈవో తాతబ్బాయిదొర, గిరిజన సంక్షేమశాఖ ఏఈ వీరభద్రరావు, ప్రిన్సిపాల్ షేక్ మదీనా తదితరులున్నారు.

కన్నయ్య కుటుంబానికి నేతల పరామర్శ



బాధిత కుటుంబానికి సరుకులు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ముంచంగిపుట్టు: లక్ష్మీపురం పంచాయతీ బిరిగూడ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత వంతాల కన్నయ్య(60) ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర ఆదేశాలతో మంగళవారం వైఎస్సార్‌సీపీ నేతలు గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని కలిసి పరామర్శించారు. పార్టీ అండగా ఉంటోందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబానికి బియ్యం, నూనె, ఇతర నిత్యావసర సరకులను అందజేశారు. మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్, నాయకులు జె.వి.వి.ఎన్. మూర్తి, జగబందు, జయదేవ్, సాధురాం, కొండలరావు, తిరుపతి, రాంప్రసాద్ పాల్గొన్నారు.

నేడు ప్రజావేదిక

చింతపల్లి: మండల కేంద్రంలో బుధవారం ప్రజావేదిక నిర్వహించనున్నట్టు ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఎం కొండబాబు మంగళవారం ఒక ప్రకటన లో తెలిపారు. 2020-21, 2021-22 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి సుమారు రూ.40 కోట్లతో పనులు చేపట్టామన్నారు. సామాజిక తనిఖీలు పూర్తయ్యాయని, అభ్యంతరాలు వెల్లడిస్తారని ఆయన తెలిపారు.

అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి



మారేడుమిల్లిలో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిబ్బంది



గంగవరంలో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీటీ , ఆర్ఐ తదితరులు

రాజవొమ్మంగి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సాధన కోసం పొట్టి శ్రీరాములు చేసిన ప్రాణత్యాగాన్ని గుర్తు చేసుకున్నారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజవొమ్మంగి జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ తెలుగు రాష్ట్ర సాధన కోసం పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి ప్రాణాలను సైతం అర్పించారన్నారు. ఆయన చేసిన త్యాగాలు చిరస్మరణీయమన్నారు. ఆయన ఆశయన సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మారేడుమిల్లి: మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో వీర కిషోర్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం స్థానిక కేజీబీవీని సందర్శించారు. మెనూ అమలుతీరుపై ఆరా తీశారు. విద్యార్థులో ఆరోగ్య భద్రతపై పలు సూచనలిచ్చారు.

గంగవరం : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీమన్నారాయణ, డీటీ రామకృష్ణ, ఆర్ఐ జిలానీ, వీఆర్వోలు రామలక్ష్మి, రాజేశ్వరి, ఏఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

చింతపల్లి: స్థానిక డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాత్రుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్'తో ఇంటింటికీ వైద్య సేవలు



అడ్డతీగలలో రోగిని పరీక్షిస్తున్న వైద్యులు



కించాయిపుట్టులో పరీక్షలు చేస్తున్న డాక్టర్ శిరీష, జిల్లా నోడల్ అధికారి విశ్వేశ్వరరావు

అడ్డతీగల: ఇంటింటికీ వైద్య సేవలందించాలనే లక్ష్యంతో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలుచేస్తోందని దుప్పలపాలెం వైద్యాధికారి షమా అన్నారు. మండలంలోని రాయపల్లిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు.104 వాహన వైద్యుడు పి.నాగేశ్వరరావుతో కలిసి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యంతో ఉన్నవారికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. సబ్‌సెంటర్ వద్ద శిబిరం నిర్వహించి వైద్య సేవలందించారు. సిబ్బంది పోశమ్మ, ఏఎన్‌ఎంలు తదితరులున్నారు.

ముంచంగిపుట్టు: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ శిరీషా, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ టి.విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో కించాయిపుట్టు పంచాయతీ కేంద్రంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 40 కుటుంబాలకు వైద్య సేవలందించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామస్తులు ఆరోగ్య భద్రతపై అవగాహన కల్పించారు. కిలగాడ వైద్య సిబ్బంది ఉన్నారు.

ముమ్మరంగా పింఛన్ల పంపిణీ



మర్రిపాలెంలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి



సుజనపేటలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న గ్రామ వలంటీర్ జానకమ్మ

రాజవొమ్మంగి: మండలంలో ఒకటవ తేదీ, మంగళవారం సాయంకాలానికి 70శాతానికి పైగా వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ పూర్తయినట్టు ఎంపీడీవో కె.బాపన్నదొర తెలిపారు. మండలానికి చెంది మొత్తం 6,333 పింఛన్లకు గాను రూ.1.58కోట్లు నిధులు మంజూరైనట్లు చెప్పారు. మండలంలోని మర్రిపాలెం గ్రామంలో జరుగుతున్న పింఛన్ల పంపిణీను ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పరిశీలించారు. గ్రామంలోని వృద్ధురాలు కుంజం సావిత్రి ఇంటికి వలంటీర్ బాలకృష్ణతో పాటు పింఛను సొమ్ము అందజేశారు.దీనిపై వృద్ధురాలు ఆనందం వ్యక్తం చేశారు.

ముంచంగిపుట్టు: మండలంలో పింఛన్ పంపిణీ ప్రక్రియ ఒకటో తేదీ మధ్యాహ్నానికి 3381 మందికి అందజేశారని, 55.41 శాతం పూర్తయినట్టు ఎంపీడీవో ఎస్.కిరణ్‌కుమార్ చెప్పారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి గ్రామ వలంటీర్లు లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు.

కలెక్టర్ దృష్టికి గ్రామాల సమస్యలు



కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసిన నాయకులు, తదితరులు

వై.రామవరం: మండలంలోని వివిధ పంచాయతీల్లో నెలకొన్న తాగునీరు, రోడ్లు, వంతెనలు, అంగన్‌వాడీ భవనాలు తదితర సమస్యలను కలెక్టర్ సుమిత్‌కుమార్ దృష్టికి ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి తదితరులు తీసుకెళ్లారు. ఈ మేరకు పాడేరులో వారు కలెక్టర్‌ను కలిసి సమస్యలను వివరించారు. దీనిపై కలెక్టర్ స్పందించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారని వారు చెప్పారు. వైస్ ఎంపీపీ విశ్వమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు సుబ్బలక్ష్మి, సర్పంచ్ నూకరాజు, నాయకులు విజయకుమార్ తదితరులున్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

అరకులోయ రూరల్: అరకులోయ పర్యటనకు వచ్చిన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘువర్మను జిల్లా గిరిజన ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు నందో తదితరులు కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు.పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని, హెల్త్ వలంటీర్లు, ఏఎన్‌ఎంలను నియమించాలని వినతిలో కోరారు. దయానిధి, సొర్రు, బుజ్జిబాబు తదితరులున్నారు.

నేటి నుంచి ఫార్మెటివ్ ఎస్సెస్‌మెంట్ పరీక్షలు



ఎంఆర్‌సీ భవనంలో ఉన్న ప్రశ్నపత్రాలు

రాజవొమ్మంగి: మండలంలోని ప్రతి పాఠశాలలో బుధవారం నుంచి 5వ తేదీ వరకు ఫార్మెటివ్ ఎస్సెస్‌మెంట్-1 (ఎఫ్-1) 2022-23 పరీక్షలు జరుగుతున్నట్టు ఎంఈఓ కె.తాతబ్బాయిదొర తెలిపారు. ప్రశ్నాపత్రాలు విద్యావనరుల కేంద్రానికి చేరుకొన్నట్టు పేర్కొన్నారు. ఈ మేరకు 1 వ తరగతి నుంచి 5వ తరగతి వరకు 2వ తేదీన ఉదయం 10 గంటలకు తెలుగు, మధ్యాహ్నం 2 గంటలకు గణితం, 3వ తేదీ ఉదయం ఇంగ్లిష్, మధ్యాహ్నం ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, 4వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 3 నుంచి 5 తరగతులకు ఎఎస్ఎస్‌సీ పరీక్ష ఉంటుందన్నారు. అలాగే 6 నుంచి 8 తరగతులకు 2వ తేదీ మధ్యాహ్నం 1.30 నుంచి తెలుగు పరీక్ష, 3 గంటలకు మాథమెటిక్స్, 3వ తేదీ హిందీ, జనరల్ సైన్స్, 4వ తేదీ ఇంగ్లీష్, సోషల్ స్టడీస్ 5వ తేదీన మధ్యాహ్నం 1-30 నిముషాల నుంచి ఎస్ఎస్‌సీ-2 పరీక్ష వుంటుందన్నారు.9, 10 తరగులకు ఫార్మేటివ్-1 పరీక్షలు ఇదే తరహాలో 2వ తేదీ నుంచి 5వ తేదీ వరకు జరుగుతాయన్నారు. పరీక్షల నిర్వహణపై ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు ఎంఈఓ సూచనలిచ్చారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు విజయ

డుంబ్రిగుడ: కొల్లాపుట్టు పంచాయతీ డి.కొల్లా పుట్టు గ్రామంలో పాఠశాల భవనం నిర్మాణ పనులకు సర్పంచ్ రామ్మూర్తి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ నాడు-నేడు ద్వారా భవనం కోసం ప్రభుత్వం రూ.34 లక్షలు మంజూరు చేసిందన్నారు. పను ల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, వేగవంతంగా పూర్తి చేయా లని కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. ఎంపీటీసీ జిమ్మా, వైఎస్సార్‌సీపీ నాయకులు సింహాచలం, బలరాం, భీమన్న, మల్లేష్, లింగు, జాముగుడ పాఠశాల హెచ్‌ఎం సుజాత తదితరులు పాల్గొన్నారు.

కూనవరం: జగ్గవరం పంచాయతీ జీపీఎస్ పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను జెడ్పీటీసీ విజయ, సర్పంచ్ పార్వతీ మంగళవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. మెనూ అమలుతీరుపై ఆరా తీశారు.

క్రీడలతో మానసికోల్లాసం



కబడ్డీలో తలపడుతున్న విద్యార్థులు

అరకులోయ రూరల్: జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో మండల స్థాయి క్రీడా పోటీలు జరుగుతున్నాయి. కంఠభంసగుడ బాలుర ఆశ్రమ పాఠశాలలో జరిగిన పోటీల్లో 300 మంది క్రీడాకారులు డివిజన్ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్టు స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి సూరిబాబు చెప్పారు. ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. పీడీలు సద్దు, ప్రసాద్,అర్జున్, శారద, పీఈటి రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: స్థానిక ఆశ్రమ పాఠశాలలో పీడీ నూకరాజు ఆధ్వర్యంలో మండల స్థాయి ఆటల పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్, హెచ్‌ఎం శ్యామ్ సుందర్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తప్పనిసరి



గర్భిణుల వసతి గృహంలోని వేడుకలో కేక్ కట్ చేస్తున్న డాక్టర్ కీర్తి

చింతపల్లిరూరల్: గర్భిణులు వసతి గృహం సేవలు సద్వినియోగం చేసుకోవాలని సీహెచ్‌సీ డిప్యూటీ సివిల్ సర్జన్ కీర్తి కోరారు. వసతి గృహం ప్రారంభించి ఏడాదైన సందర్భంగా మంగళవారం కేక్ కోసి వేడుకలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. డాక్టర్లు రమేష్, ఇంద్ర, ప్రసన్న ఎల్‌టీ అనిల్ తదితరులున్నారు.

ఉపాధి పనుల గుర్తింపునకు గ్రామసభ



జగ్గవరంలో పంచాయతీలో గ్రామసభలో నిర్వహిస్తున్న దృశ్యం

కూనవరం: జగ్గవరంలో సర్పంచ్ పార్వతీ అధ్యక్షతన ఉపాధి పనులకు మంగళవారం గ్రామసభ నిర్వహించారు. జెడ్పీటీసీ విజయ, సర్పంచ్ పార్వతీ మాట్లాడుతూ రహదారుల ఎనులు చేయాలన్నారు. ఫారంపాండ్లు, భూమి చదును పనులకు తీర్మానాలను ఆమోదించారు.

దిశ చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాస్

జి.మాడుగుల: జి.ఎం.కొత్తూరు గ్రామంలోని కేజీబీవీలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు దిశా చట్టంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని, వీరి సంరక్షణపై తల్లిదండ్రులు కూడా బాధ్యత తీసుకోవాలని కోరారు. ప్రత్యేకాధికారి పార్వతి, విద్యార్థినుల తల్లిదండ్రులు, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు మత్స్యలింగం

హుకుంపేట: ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవో వెంకటరావు, తహసీల్దార్ రాజ్యలక్ష్మి, డీటీ భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శులతో జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అర్హులైన వారికి ఓటర్లుగా నమోదు చేయించేలా పంచాయతీ కార్యదర్శులు చూడాలన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న న్యాయవాదులు శ్రీధర్, రమణ

అడ్డతీగల: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని న్యాయవాదులు కె.ఎస్.వి.రమణ, డి.శ్రీధర్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆదేశాల మేరకు గ్రామాల్లో ప్రజలకు చట్టాలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా భీముడుపాకలులో మంగళవారం చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 1 నుంచి 13వ తేదీ వరకూ పాన్ ఇండియా కార్యక్రమాల్లో భాగంగా ఈ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. రాజ్యాంగంలో హక్కులను సద్వినియోగం చేసుకుని ఎంచుకున్న రంగాల్లో అభివృద్ధిని సాధించాల న్నారు. అలాగే ప్రతి ఒక్కరూ చట్టాలు, హక్కుల భాద్యతలను విస్మరించవద్దన్నారు. ఘర్షణ పూర్వకమైన వాతావరణానికి దూరంగా ఉండాలన్నారు. మహిళల హక్కులు, వారికి రక్షణగా చట్టాలు, ప్రభుత్వ సేవలను వివరించారు.

సీఐటీయూ నేతల ఆందోళన

పాడేరురూరల్: పాడేరు, అరకు, చింతపల్లి, ముంచంగిపుట్టు ప్రభుత్వ ఆస్పత్రుల్లో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సుందరరావు అన్నారు. పాడేరు జిల్లా కేంద్రంలోని పారిశుధ్య కార్మికులతో కలిసి ఆందోళన చేపట్టారు.